

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | ఆదివారం 11 అక్టోబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 21 | పేజీలు : 04, వెల రూ.2

తిరుమల శ్రీవారికి జైపూర్ దంపతుల ఖరీదైన కానుక..



శ్రీవారికి రూ. 51.55 లక్షల విలువైన ఆభరణాలు విరాళం

జైపూర్ దంపతులు సమర్పించిన బంగారు లాకెట్, ముత్యాల హారం

టీటీడీ బర్డ్ ట్రస్ట్‌కు రూ. 10 లక్షల భారీ విరాళం

అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన దాత హర్షవర్ధన్ రెడ్డి

అమరావతి : తిరుమల శ్రీవారికి నేడు భారీగా విరాళాలు, కానుకలు అందాయి. భక్తులు స్వామివారికి విలువైన ఆభరణాలతో పాటు టీటీడీ నిర్వహిస్తున్న ట్రస్ట్‌కు నగదు రూపంలో విరాళాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన ఆర్తి బిందాల్ దంపతులు శ్రీవారికి రూ. 51.55 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను విరాళంగా అందించారు. ఇందులో వజ్రాలు, రత్నాలు పొదిగిన మిగతా..2లో

రోడ్ టెండర్లలో వేల కోట్ల కుంభకోణం.. కేటీఆర్



రూ.600 కోట్ల నష్టం జరిగిందన్న ఆరోపణలపై విచారణకు డిమాండ్

రైతును పురుగుల మందు తాగి చావలేదా అని అడుగుతారా?

అన్నదాతల పట్ల ఇంత అమానవీయంగా వ్యవహరిస్తారా?

హైదరాబాద్: రేడియల్ రోడ్-2 టెండర్లలో 3,296 కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ అంశమై ఈరోజు (శనివారం) సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. నచ్చిన సంస్థలకే కాంట్రాక్టులు కట్టబెట్టారని తక్కువ ధరకు బిడ్లు వేసిన సంస్థలను పక్కన పెట్టారు. ఐదు పని దినాల్లోనే టెండర్ల ప్రక్రియ ఎలా పూర్తి చేసారని లేఖలో ప్రశ్నించారు టెండర్లలో రూ.600 కోట్ల నష్టం జరిగిందన్న ఆరోపణలపై విచారణకు డిమాండ్ రేడియల్ రోడ్-1 టెండర్లపైనా అనుమానాలున్నాయని టెండర్లను రద్దు చేసి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మిగతా..2లో

యువత ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి



- వికసిత్ భారత్2047 నిర్మాణంలో విద్యార్థులే కీలకమని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందని ఉద్ఘాటించారు.

విజయవాడ, అక్టోబరు 10 : వికసిత్ భారత్2047 నిర్మాణంలో విద్యార్థులే కీలకమని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవపై రాష్ట్రస్థాయి పోటీలను (శనివారం) విజయవాడలో బీజేపీ నేతలు నిర్వహించారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..
ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- కూటమి పక్షాల ద్వారా 34 శాతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



అమరావతి :ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ చైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ చైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. మిగతా..2లో

జగన్‌కు ఈడీ షాక్.. అక్రమాస్తుల కేసులపై
హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ





- జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన
- దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు
- విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన మిగతా..2లో

ఏపీ ప్రజలకు అలెర్ట్: రాబోయే 3 రోజులు వర్షాలు.. 30-40 కిమీ వేగంతో ఈదురుగాలులు..



- జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.
- శనివారం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది.

ఆంధ్రప్రదేశ్, యానాం పరిసర ప్రాంతాలలో రాబోయే మూడు రోజుల వాతావరణానికి సంబంధించి

భుజ్ భూకంపం.. నరేంద్ర మోదీ
రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పిన విపత్తు..

- ప్రకృతి విపత్తులు ప్రజల జీవితాలనే కాదు.. కొన్నిసార్లు రాజకీయ నాయకుల భవిష్యత్తును కూడా మార్చేస్తాయి.
- కొందరు పదవులు కోల్పోతారు.. మరికొందరు ఆ విపత్తు నుంచే ఎదుగుతారు.
- గుజరాత్‌లో 2001 జనవరి 26న సంభవించిన భుజ్ భూకంపం అలాంటి ఘటనే.



ఢిల్లీ: ప్రకృతి విపత్తులు ప్రజల జీవితాలనే కాదు.. కొన్నిసార్లు రాజకీయ నాయకుల భవిష్యత్తును కూడా మార్చేస్తాయి. కొందరు పదవులు కోల్పోతారు.. మరికొందరు ఆ విపత్తు నుంచే ఎదుగుతారు. గుజరాత్‌లో 2001 జనవరి 26న సంభవించిన భుజ్ భూకంపం అలాంటి ఘటనే. వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఈ విపత్తు, గుజరాత్ పునర్నిర్మాణానికి పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారాయి. అప్పటికి భారతీయ జనతా పార్టీ కీలక నేతగా ఉన్న నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఆ భూకంపం వల్ల లభించింది 2001 జనవరి 26న గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో సంభవించిన భారీ భూకంపం తీవ్ర విధ్వంసాన్ని సృష్టించింది. భుజ్‌తో పాటు అనేక ప్రాంతాల్లో భవనాలు కూలిపోయాయి. వేలాది మంది మరణించగా, పెద్ద సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. మిగతా..2లో

40 ఏళ్ల నాటి నిషేధం ఎత్తివేత..
డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం!

- 1985 నుంచి నిలిచిపోయిన రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులపై ఉన్న 40 ఏళ్ల నాటి నిషేధాన్ని ఆయన అధికారికంగా ఎత్తివేశారు.
- బ్లూ నైల్ ప్రావిన్స్‌లోని అబు శంది ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడిలో చిన్నారులతో సహా కనీసం 40 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు.



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లెబనాన్‌కు సంబంధించి ఓ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. 1985 నుంచి నిలిచిపోయిన రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులపై ఉన్న 40 ఏళ్ల నాటి నిషేధాన్ని ఆయన అధికారికంగా ఎత్తివేశారు. ఈ కీలక నిర్ణయాన్ని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ అవూన్ స్వాగతించారు. సివిల్ ఏవియేషన్ భద్రత విషయంలో లెబనాన్ చేపట్టిన చర్యలపై అమెరికాకు ఉన్న నమ్మకానికి మిగతా..2లో

కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి: బీజేపీ శ్రేణులకు
రాంచందర్ రావు పిలుపు



- ఎన్నికల కమిషన్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్న రాంచందర్ రావు
- వరుస ఓటములతోనే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ
- రాజ్యాంగబద్ధ సంస్థలపై బురద చల్లుతున్నారని మండిపాటు

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ (ఈసీ) పారదర్శకంగా

హైదరాబాద్ హైస్పీడ్ రైల్..
భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

- భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి
- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి



హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం మిగతా..2లో

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని
ప్రజలు నమ్మలేదు



- గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి
- ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి

హైదరాబాద్ : తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..
ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

జగన్‌కు ఈడీ షాక్.. అక్రమాస్తుల
కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ల పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్ల వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

తిరుమల శ్రీవారికి జైపూర్ దంపతుల ఖరీదైన కానుక..

147 గ్రాముల బంగారు లాకెట్, వజ్రాలు, కెంపులు పొదిగిన 27 గ్రాముల మూడు వరుసల ముత్యాల హారం ఉన్నాయి. ఈ ఆభరణాలను ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు దాతలు స్వయంగా అందజేశారు. ఉత్సవమూర్తుల అలంకరణకు వీటిని వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న 'బర్డ్' ట్రస్ట్‌కు కూడా భారీ విరాళం అందింది. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన దాత హర్షవర్ధన్ రెడ్డి రూ. 10 లక్షలు విరాళంగా ఇచ్చారు. హర్షవర్ధన్ రెడ్డి తరఫున టీటీడీ పాలకమండలి సభ్యుడు నన్నపనేని సదాశివరావు ఈ డీడీని ఛైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. టీటీడీ సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న దాత హర్షవర్ధన్ రెడ్డికి ఛైర్మన్ బీఆర్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని
ప్రజలు నమ్మలేదు: మంత్రి పొంగులేటి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు

భుజ్ భూకంపం.. నరేంద్ర మోదీ
రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పిన విపత్తు..

ఇళ్లు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. సహాయక చర్యలు, శిథిలాల తొలగింపు, బాధితులకు పునరావాసం కల్పించడం అప్పటి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారాయి. భూకంపం తర్వాతి సహాయక చర్యల నిర్వహణ విషయంలో అప్పటి ముఖ్యమంత్రి కేశూభాయ్ పటేల్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో భారతీయ జనతా పార్టీ గుజరాత్‌లో నాయకత్వ మార్పుపై దృష్టి సారించింది భారతీయ జనతా పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించిన మోదీని గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎంపిక చేశారు. 2001 అక్టోబర్ 7న ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేశారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసిన అనుభవజ్ఞులైన అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించారు. పునర్నిర్మాణ నిర్ణయాలను, పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఆ తర్వాత గుజరాత్‌లోని మౌలిక వసతులను నెలకొల్పడంపై దృష్టి సారించారు భుజ్ భూకంపాన్ని మోదీ రాజకీయ జీవితంలో కీలక మలుపుగా పేర్కొనవచ్చు. 2001 అక్టోబర్ 7న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోదీ అప్పట్నుంచి అధికారంలోనే ఉంటూ వస్తున్నారు. 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా సేవలందిస్తున్నారు. 2026 అక్టోబర్ 7తో ఆయన ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్ల పూర్తి చేసుకున్నారు.

రోడ్ టెండర్లలో వేల కోట్ల కుంభకోణం.. కేటీఆర్

హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కాంట్రాక్టులపై కాగ్ ప్రత్యేక ఆడిట్ జరపాలి. రేడియల్ రోడ్ల టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. అదే విధంగా ఇటీవల గజ్వేల్ రైతుపట్ల వ్యవహరించిన తీరుపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సమస్యను పరిష్కరించాల్సింది పోయి బాధను ఎగతాళి చేస్తారా? రైతును పురుగుల మందు తాగి చావలేదా అని అడుగుతారా? అన్నదాతల పట్ల ఇంత అమానవీయంగా వ్యవహరిస్తారా? అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి
బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు

ఓటర్ల జాబితాను సిద్ధం చేసిందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, మీడియా ప్యానలిస్టులతో జరిగిన సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. దొంగ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు. వరుస ఎన్నికల్లో ఓటమి పాలవుతున్న కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజాస్వామ్యంలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటర్ల జాబితా నుంచి తమ మద్దతుదారుల పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో రాంచందర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జాతీయ స్థాయిలో రాష్ట్రపతిని కూడా కలిసి తమ వాదనలు వినిపించారు.

తెలంగాణలోని కరవు మండలాలను గుర్తించండి'

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. సాగు, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలు సమావేశంలో చర్చకు రానున్నాయి.

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. మంత్రులతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వర్షాభావ ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగు నీరు, పెరిగిన విద్యుత్ డిమాండ్, తాగునీటి సరఫరా తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

అఖిలపక్ష సమావేశంపైనా

ఇటీవల జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో సాధారణం కన్నా 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నట్లు కూడా సర్కారు అంచనా వేస్తోంది. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయాన్ని అందించాలని ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల స్పెషల్ ప్యాకేజీని కేటాయించాలని కూడా కోరింది. ఈ క్రమంలో వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీ రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, పలు రంగాలకు చెందిన నిపుణుల సలహాలు, సూచనలపై రేవంత్ రెడ్డి నిర్వహించనున్న సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

ప్రాథమిక నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశం

క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి, కరవు ప్రభావిత మండలాలపై ప్రాథమిక నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై సమీక్షించేందుకు శుక్రవారం సెక్రటేరియట్ లో ఉన్నతాధికారులతో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

యువత ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, తదితర పోటీలను మంత్రి సత్యకుమార్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని.. వారే రేపటి దేశ నిర్మాతలు, నాయకులు అని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని వివరించారు.

భారత్‌ను అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు యువత కృషి చేయాలి..

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని.. 2047 నాటికి స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుందని మంత్రి సత్యకుమార్



వెల్లడించారు. అప్పటికీ భారతదేశాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు యువత కృషి చేయాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగుతోందని చెప్పుకొచ్చారు. దేశాభివృద్ధిలో యువత ఆలోచనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. వైద్య కళాశాలలు, వైద్య విద్యలో సీట్లు, ఉన్నత విద్యాసంస్థల విస్తరణతో విద్యార్థులకు అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి సంస్థల విస్తరణ దేశ మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడుతోందని చెప్పారు.

ఎగుమతులను పెంచే దిశగా దేశం ముందుకు సాగాలి..

పీఎం శ్రీ పాఠశాలలు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపయోగపడుతున్నాయని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. సెమీకండక్టర్లు, లిథియం బ్యాటరీలు, అరుదైన ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం వంటి రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. యువత కొత్త ఆలోచనలతో స్టార్టప్‌లు స్థాపించి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఎగుమతులను పెంచే దిశగా దేశం ముందుకు సాగాలని అభిలాషించారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములయ్యేలా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.

40 ఏళ్ల నాటి నిషేధం ఎత్తివేత.. డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం!

మొదటి పేజి తరువాయి

ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు.

భద్రత విషయంలో నో కాంప్రమైజ్.. ఎలన్ మస్క్ తొందరపాటుకు భారత్ చెక్!

1985లో 'ఫ్లైట్ 847' విమానం హైజాక్ కు గురైన తర్వాత నాటి రోనాల్డ్ రీగన్ ప్రభుత్వం ఈ ప్రత్యక్ష విమాన సర్వీసులపై నిషేధం విధించింది. ఇటీవల జులైలో లెబనాన్ అధ్యక్షుడు అవూన్ వాషింగ్టన్‌లో పర్యటించిన సమయంలో అమెరికా విమానయాన సంస్థలు మళ్లీ నేరుగా విమానాలను నడిపేందుకు అనుమతిస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇజ్రాయెల్ తో జరిగిన యుద్ధాల్లో ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా బలహీనపడటం, దాని ముఖ్య నేతలు హతమవ్వడం వంటి పరిణామాల మధ్య ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు డ్రోన్లు, మిస్సైల్లతో రియాద్ విమానాశ్రయంపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో మూడు విమానాలు తీవ్రంగా దెబ్బతినగా.. ముగ్గురు సౌదీ పౌరులు మరణించారు. పలువురు పౌరులు గాయపడ్డారు. ఈ దాడుల కారణంగా విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది.

నాకు నోబెల్ కావాల్సిందే.. మారాం చేస్తున్న ట్రంప్!

ఇదే సమయంలో ఆఫ్రికా దేశమైన సూడాన్ లో దారుణం చోటుచేసుకుంది. బ్లూ నైల్ ప్రావిన్స్‌లోని అబు శంది ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడిలో చిన్నారులతో సహా కనీసం 40 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఆర్మీతో పోరాడుతున్న పారామిలిటరీ బలగం



ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ దాడిపై ఐక్యరాజ్యసమితి తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తం చేసింది.

హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

మొదటి పేజి తరువాయి

ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో



కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

ఏపీ ప్రజలకు అలెర్ట్: రాబోయే 3 రోజులు వర్షాలు.. 30-40 కిమీ వేగంతో ఈదురుగాలులు..

మొదటి పేజి తరువాయి

భారత వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కీలక బులెటిన్‌ను విడుదల చేశాయి. దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా వీస్తున్న వీచే గాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఇదే సమయంలో తెలంగాణలో రుతుపవనాలు నిష్క్రమించడంతో సాధారణ వాతావరణం నెలకొంటుందని స్పష్టం చేశారు.

కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఈదురుగాలులతో కూడిన జల్లులు:

ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, శనివారం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది. అలాగే ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

తెలంగాణలో ఆహ్లాదకరమైన వాతావరణం.. మధ్యాహ్నం వేడి:

మరోవైపు తెలంగాణలో నైరుతి రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమించడంతో భారీ వర్ష సూచన ఏమీ లేదని వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి చినుకులు తప్ప పెద్దగా వర్షాలు ఉండకపోవచ్చని స్పష్టం చేసింది. ఫలితంగా ఉదయం, సాయంత్రం వేళల్లో



వాతావరణం ఆహ్లాదకరంగా చల్లగా ఉంటుందని, అయితే మధ్యాహ్నం వేళల్లో కొద్దిపాటి ఎండ మరియు ఉక్కపోత ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ వివరించింది.

విమానంలో పైలట్ స్మిత్ పై దాడి- కేసు నమోదు

విమానం గాల్లో ఉండగానే కెప్టెన్ స్మిత్ మచ్చర్ పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించింది.

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. ఇప్పటికే ఆ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన అధికారులు, దాడికి దారితీసిన పరిస్థితులు, విమానాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నం జరిగిందా? అనే అంశాలపై దర్యాప్తు చేయనున్నారు. అయితే స్మిత్ మచ్చర్ పై దాడి చేసిన ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. భారతీయ పైలట్‌పై దాడి జరగడం, విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా కూల్చివేయడానికి ప్రయత్నం జరిగి ఉండొచ్చనే అనుమానాల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు అవసరమని భావించింది. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థకు కేసును అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎన్ఐఏ అక్టోబర్ 9న కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. యాంటీ హైజాకింగ్ చట్టం-2016లోని సంబంధిత నిబంధనలతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)-1967 కింద కేసు నమోదు చేశారు. యూఏపీఏలోని సెక్షన్ 16తో పాటు సెక్షన్ 15(1)(ఎ) నిబంధనలను కూడా ఆ కేసుకు వర్తింపజేసినట్లు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం-2008 ప్రకారం, ఈ కేసులో పేర్కొన్న నేరాలు ఎన్ఐఏ విచారణ చేపట్టేందుకు వీలున్న నేరాల జాబితాలోకి వస్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం చట్టంలోని సెక్షన్ 6లోని ఉప సెక్షన్లు 5, 8తో పాటు సెక్షన్ 8 కింద తన అధికారాలను ఉపయోగించి దర్యాప్తునకు ఆదేశించింది.

పెద్ద కుట్ర ఏమైనా ఉందా?

ఘటన వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా అనే అంశాన్ని కూడా ఎన్ఐఏ పరిశీలించనుంది. కాక్‌పిట్‌లో అసలు ఏం జరిగింది, దాడికి దారితీసిన పరిస్థితులు ఏమిటి, విమానాన్ని హైజాక్ చేయాలనే ఉద్దేశం ఉందా, విమానాన్ని కూల్చివేయడానికి ప్రయత్నించారా అనే కోణాల్లో దర్యాప్తు సాగనుంది. ఈ ఘటనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర పరిణామాలు ఉండే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే కో పైలట్ దాడికి పాల్పడటానికి గల కారణాలు ఏమిటి, ఘటనకు ముందు విమానంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయి అనే విషయాలపై ఇప్పటివరకు స్పష్టమైన వివరాలు



వెల్లడికాలేదు. దాడి వెనుక ఉద్దేశం ఏమిటనేది కూడా తేలాల్సి ఉంది. ఆ అంశాలన్నింటినీ పరిశీలించి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకురావడమే ఎన్ఐఏ దర్యాప్తు లక్ష్యంగా ఉండనుంది.

అసలేం జరిగింది?

సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్ 1073 బయలుదేరింది. ఉదయం 7.05 గంటలకు గల్ఫ్ కాలమానం ప్రకారం ప్రయాణం ప్రారంభించింది. ఆ విమానంలో 174 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. విమానానికి భారతీయుడైన కెప్టెన్ స్మిత్ మచ్చర్ నాయకత్వం వహించగా, ఒమన్‌కు చెందిన వ్యక్తి కో పైలట్‌గా ఉన్నారు. విమానం జోర్డాన్-సౌదీ అరేబియా సరిహద్దు ప్రాంతం సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో కెప్టెన్ స్మిత్‌పై కో పైలట్ కత్తితో దాడి చేశారు. ఆ దాడి విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా దాన్ని కూల్చివేయడానికి చేసిన ప్రయత్నం అయి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కాక్‌పిట్‌లో జరిగిన దాడిని గుర్తించిన ప్రయాణికులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. దాడికి పాల్పడిన కో పైలట్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. చివరకు అతడిని నిలువరించి కట్టడి చేసినట్లు సమాచారం. ఆ దాడిలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. విమానంలో ఇతర ఫ్లైదుబాయ్ పైలట్లు కూడా ఉండటంతో వారు విమాన నియంత్రణ బాధ్యతలు చేపట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకుని విమానాన్ని సురక్షితంగా దించారు. సౌదీ అరేబియాలోని వాయవ్య ప్రాంతంలో ఉన్న టబుక్‌లోని ప్రిన్స్ సుల్తాన్ బిన్ అబ్దుల్ అజీజ్ విమానాశ్రయానికి ఉదయం సుమారు 10.45 గంటలకు విమానం చేరుకుంది. అనంతరం దాడికి పాల్పడిన సహ పైలట్‌ను సౌదీ అధికారులు అరెస్టు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ సమాచారం వెల్లడించింది.

అనంతపురం జెడ్పీకి రెగ్యులర్ డిప్యూటీ సీఈఓ



అనంతపురం దరువు న్యూస్: అనంతపురం జిల్లా పరిషత్‌కు రెగ్యులర్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డిప్యూటీ సీఈఓ)గా సమతను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా పంచాయతీ అధికారిగా (డీపీఓ) పనిచేస్తున్న ఆమెను అనంతపురం జెడ్పీ డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.గతంలో డిప్యూటీ సీఈఓగా పనిచేసిన లక్కిరెడ్డిపల్లి వెంకటసుబ్బయ్య కడప జిల్లా పులివెందులకు బదిలీ అయినప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది.అప్పటి నుంచి ఇన్‌చార్జి బాధ్యతలతోనే కార్యాలయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.ఈ నేపథ్యంలో రెగ్యులర్ అధికారిని నియమించడంతో జెడ్పీ పరిపాలనకు ఊరట లభించనుంది.సమతను తొలుత శ్రీ సత్యసాయి జిల్లా డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసి, తాజాగా అనంతపురం జెడ్పీకి నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది.రెగ్యులర్ డిప్యూటీ సీఈఓ నియామకంతో జెడ్పీ ఉద్యోగులు, ఎంపీడీఓల్లో హర్షం వ్యక్తమవుతోంది.

తాడిపత్రిలో 'ఆపరేషన్ వజ్ర ప్రహార్'



అనంతపురం దరువు న్యూస్: జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు తాడిపత్రిలో శనివారం పోలీసులు 'ఆపరేషన్ వజ్ర ప్రహార్'లో భాగంగా విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ తనిఖీలు నిర్వహించారు. మొత్తం 249 మంది పోలీసు సిబ్బంది పాల్గొని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.తాడిపత్రి పట్టణ పరిధిలోని టైలర్స్ కాలనీ, నందలపాడుతో పాటు తాడిపత్రి రూరల్ పరిధిలోని ఇగుడూరు, గంగాదేవిపల్లి, వెంకటరెడ్డిపల్లి, బోడాయిపల్లి, ఆలూరు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 90 ఇళ్లను తనిఖీ చేసి, 140 మందిని విచారించారు.తనిఖీల్లో 10 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్, 180 ఎం.ఎల్. సామర్థ్యం గల 31 అడ్మిరల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.సామాజిక శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు.

పారదర్శకంగా భూముల మ్యూటేషన్ ప్రక్రియ పూర్తి

గోరంట్ల, దరువు న్యూస్: గత సెప్టెంబర్ నెలలో భూముల మ్యూటేషన్ కోసం



దరఖాస్తు చేసుకున్న పట్టాదారుల అర్జీలపై విచారణ నిర్వహించి, మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్ కుమార్ తెలిపారు, ఈ సందర్భంగా సంబంధిత పట్టాదారులకు సమాచారం అందించి, గోరంట్ల తహసీల్దార్ కార్యాలయంలో వారికి 1-బి కాపీలను రైతులకు అంద జేశారు, ఈ కార్యక్రమంలో రైతులు రఘునాథ్ రెడ్డి, వి ఆర్ ఓ లు నాగరాజు రావు,అశోక్ , లక్ష్మీ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కార్యకర్తలే అధినేతలు

-మంత్రి సవితమ్మ



మంగళగిరి, దరువు న్యూస్: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జులకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖా మంత్రి ఎస్ సవిత శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. టీడీపీలో కార్యకర్తలే అధినేతలని మంత్రి సవిత తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ప్రాధాన్య మిస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి జనసేన, బీజేపీ నాయకులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు.

పుట్టపర్తిలో ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మ దగ్ధం

రాజీనామా చేయాలి.. లేదంటే సస్పెండ్ చేయాలి: వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



పుట్టపర్తి దరువు న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి సచివాలయం ఎదుట ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దగ్ధం చేశారు.జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిని సమీక్షించి, ప్రజాస్వామ్య విలువలు, ప్రజల హక్కులను పరిరక్షించాలని కోరారు. ప్రజల అభిప్రాయాలు, రాజకీయ పార్టీల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ స్పందించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అవసరమైతే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరి, సీఐటీయూ కార్యదర్శి పైపల్లి గంగాధర్, గ్రామస్తులు టి. జనార్ధన, పోతక్క, కుళ్లాయమ్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల మహాధర్నా



పుట్టపర్తి దరువు న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన మహాధర్నా ఐదో రోజుకు చేరుకుంది.తమ సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు.వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు కోరారు.సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు, వేతన సంబంధిత సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి సంబంధిత అధికారులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం వంటి ప్రధాన డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

పుట్టపర్తి దరువు న్యూస్: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సీపీఐ నాయకులు పుట్టపర్తిలో నిరసన చేపట్టారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి గణేష్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పిండతర్పణం నిర్వహించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సీపీఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చలపతి నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, ఓటరు జాబితాను పారదర్శకంగా నిర్వహించడం ఎన్నికల సంఘం బాధ్యత అని అన్నారు.ఓటర్ల పేర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో తగిన ఆధారాలు, పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించిన అనంతరం ఆధారాలు కోరడం, పూర్వీకుల ఓటరు వివరాలను సమర్పించాలని చెప్పడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. అర్హులైన ఓటర్లు తమ హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిని చేయాలని, ఈవీఎంలను రద్దు చేసి ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఓటరు జాబితా సవరణలో అవకతవకలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జి. సుధాకర్, రైతు సంఘం ఓడీసీ మండల కార్యదర్శి



రామచంద్ర, పి. నాగరాజు, నల్లమాడ సీపీఐ మండల సహాయ కార్యదర్శి గంగాధర్, ఎస్. నాగరాజు, వీరప్ప, వేములేటిపల్లి రామాంజనేయులు, కుళ్లాయమ్మ, నీలమ్మ, సరస్వతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జె.సి. అస్మిత్ రెడ్డితో ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్ భేటీ



తాడిపత్రి, దరువు న్యూస్: తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి. అస్మిత్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ టిడ్కో చైర్మన్ శ్రీ వేములపాటి అజయ్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడిపత్రి పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన విషయాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో తాడిపత్రి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీ కదిరి శ్రీకాంత్ రెడ్డితో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పుట్టపర్తి అభివృద్ధికి రూ.2,500 కోట్లకు పైగా ఖర్చు



పుట్టపర్తి, దరువు న్యూస్: వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయాన్ని అడ్డుకోలేరని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం పుట్టపర్తి మండలంలోని పలు గ్రామాల్లో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి పర్యటించి, రూ.31.77 కోట్లతో చేపట్టిన 35 అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.2,500 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో నెలకొన్న పరిస్థితులతో బిల్డర్లు సైతం బెంగళూరుకు వెళ్లాల్సి వచ్చిందని విమర్శించారు.ప్రస్తుతం నియోజకవర్గంలో స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొందని, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.భారీ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు పుట్టపర్తి ప్రాంతానికి భారీ పెట్టుబడులు తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు, ఆమడగూరు మండలంలో రిలయన్స్ ఆధ్వర్యంలో ప్రతిపాదిత సోలార్ ప్రాజెక్టులు ప్రాంత అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే సుమారు 4,000 మందికి ఉపాధి కల్పించే జీన్స్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుందని వెల్లడించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అంశంపై టీడీపీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు



తెలిపారు.బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పల్లె సింధూర రెడ్డి నాయకత్వంలో రెండేళ్లలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు విజయకుమార్, శ్రీరామ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ నాయక్, బొమ్మయ్య, నాగరాజు, మహేష్, వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎవరు అడ్డొచ్చినా బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తాం



- బీసీల ఎదగకూడదన్నదే వైసీపీ ప్రధాన లక్ష్యం.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి మీడియా సమావేశం
- మహిళ స్థల వివాదంలోకి తనను లాగడం పై దగ్గుపాటి ఆగ్రహం
- ఇదంతా మా పార్టీ కోవర్టులు, వైసీపీ వారి పనే
- నిద్రలో కూడా వారికి దగ్గుపాటినే గుర్తొస్తున్నాడు
- నగరంలో 62కి 62స్థానాలు గెలుస్తామన్న దగ్గుపాటి
- మేయర్ అభ్యర్థిని నిర్ణయించేది అధిష్టానమేన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం, అక్టోబర్ 10, దరువు న్యూస్ :

ఎవరు అడ్డుకున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడారు. ఈ సమావేశంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, పిఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వర్, క్లస్టర్ ఇంచార్జ్ వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, బీసీలకు తెలుగుదేశం ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ.. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేసిన ద్రోహాన్ని వివరించారు. బీసీలకు మొదటి నుంచి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ తెలుగుదేశం మాత్రమేనన్నారు. గతంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యతను 20శాతం నుంచి 34 శాతానికి పెంచిన ఘనత టీడీపీదేనన్నారు. ఆరోజు ఎన్టీఆర్.. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అనేక మంది బీసీ నేతలకు ఉన్నత పదవులు దక్కాయన్నారు. బీసీలకు మొదటి నుంచి ద్రోహం చేసింది వైసీపీనేనని, కేవలం అధికారం తన వర్గానికే ఉండాలనేది జగన్ ఆలోచనన్నారు. గతంలో శంకర్ నారాయణ లాంటి వారు మంత్రిగా ఉన్నప్పటికీ, వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా జగన్ రెడ్డి అణచివేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్లు రాకుండా హైకోర్టులో, ఆపై సుప్రీం కోర్టులో జగన్ మోకాలడ్డారని ఆరోపించారు. బీసీలు రాజకీయంగా ఎదగకూడదన్నదే జగన్ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులకు కనీసం ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కూడా దక్కలేదన్నారు. జగన్ కేవలం ముగ్గురిని మాత్రమే దగ్గర పెట్టుకుని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పూర్తిగా దూరం పెట్టారన్నారు.

రైజింగ్ రాయలసీమగా మన ప్రాంతం దూసుకుపోతోంది

రాయలసీమ ప్రాంతాన్ని రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా మార్చబోతున్నామని దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 40వేల కోట్లు, కేంద్ర ప్రభుత్వం మరియు పీపీపీ మోడల్‌లో మరో 60వేల కోట్లు తీసుకురావడం జరుగుతోందన్నారు. మదనపల్లిలో రిలయన్స్ భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మక హార్టీకల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఒక్క డ్రిప్ లేదా స్ప్రింక్లర్ కూడా ఇవ్వలేదని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 300 కోట్లతో డ్రిప్పులు, స్ప్రింకర్లను రైతులకు అందించామన్నారు. రాయలసీమ ప్రాంతానికి గతంలో ఎప్పుడూ లేని విధంగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. చిత్తూరు జిల్లాకు ప్రసిద్ధ రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ఫ్యాక్టరీని తీసుకొచ్చామన్నారు. అలాగే వేల కోట్ల పెట్టుబడులతో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. పుట్టపర్తికి యుద్ధ విమానాలు తయారు చేసే డిఫెన్స్ పరిశ్రమను తీసుకొచ్చామన్నారు. అనంతపురం జిల్లాలో రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నారన్నారు. గతంలో సీఎం చంద్రబాబు కియా మోటార్స్ తెచ్చి 50వేల మందికి ఉద్యోగ,ఉపాధి కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

సంక్షేమ పథకాల్లో పోటీ లేదు

ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఏకంగా రూ.10,400 కోట్లు జమ చేశారన్నారు. రెండవ విడుత కూడా త్వరలోనే విడుదల చేస్తారన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించగా, ఇప్పటివరకు 10 కోట్ల ప్రయాణాలు విజయవంతంగా జరిగాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వృద్ధులు, వికలాంగులకు భారీగా పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఆటో డ్రైవర్ల సేవ, చేనేత కార్మికులకు విద్యుత్ సబ్సిడీ, నేతన్న సేవ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. జగన్ గతంలో అన్న క్యాంటీన్లను మూసివేసి పైశాచిక ఆనందం పొందారని విమర్శలు చేశారు. మా ప్రభుత్వం వచ్చాక పేదల ఆకలి తీర్చడానికి 275 అన్న క్యాంటీన్లను మళ్లీ తెరిపించి.. 5రూపాయలకే 3పూటల భోజనం అందిస్తున్నామన్నారు.

అనంతలో రెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశాం

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 2వేలకోట్లకు పైగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఈ రెండేళ్లలో చేశామని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. మౌలిక వసతుల కోసం రూ.300కోట్లు ఖర్చు చేశామని, మేము చేసిన అభివృద్ధి వల్లే నేడు రాంనగర్ ప్రాంతంలో సెంట్ భూమి విలువ రూ. 20 లక్షల నుండి రూ.40లక్షలకు చేరిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డంపింగ్ యార్డ్ పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని విమర్శలు చేశారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్తను పూర్తి స్థాయిలో తొలగించే ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని.. మిగిలిన 25 శాతం పనులను రాబోయే రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. వచ్చే మూడు నెలల్లో ఇక్కడ సరికొత్త 'ఫ్రెష్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్' తీసుకురాబోతున్నామని, మిగిలిన స్థలంలో ప్రజల కోసం అందమైన పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. గత నెలలోనే అమృత్-2 ద్వారా రూ. 107 కోట్లతో నియోజకవర్గంలో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేయబోతున్నామని, రూ.50కోట్లతో నగరంలో పార్కులు, డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. వీటితో పాటు అదనంగా మరో రూ.160 కోట్లతో అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థను నిర్మించబోతున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

నాపై జరుగుతున్న కుట్రలు, దుష్ప్రచారాలపై వెనకడుగు వేసేది లేదు

గత రెండేళ్లుగా తనపై కుట్రలు, బురదజల్లే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ఉనికి కోసం కొందరు నిరుద్యోగ నాయకులు, వైఎస్ఆర్సీపీ నేతలతో చేతులు కలిపి నాపై కుట్రపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కర్నూలుకు చెందిన ఒక మహిళ వ్యక్తిగత స్థల వివాదాన్ని మంత్రి టి.జి. భరత్ నా దృష్టికి తీసుకురాగా, నేను తక్షణమే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించాలని కోరానన్నారు. ఆమె ఆగస్టులో ఒక వ్యక్తికి స్థలం విక్రయించగా, సెప్టెంబర్ 29 నాటికి రిజిస్ట్రేషన్ కావాల్సి ఉందన్నారు. అయితే ఈ ప్రక్రియ కాస్త ఆలస్యం కావడంతో మా పార్టీలోని కొందరు కోవర్టులు ఆమెను రెచ్చగొట్టారన్నారు. సదరు మహిళను కర్నూలు నుండి అనంతపురం తీసుకొచ్చి.. ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేస్తే పని త్వరగా అవుతుందని పూర్తిగా స్క్రిప్ట్ ఇచ్చి మోటివేట్ చేశారన్నారు. దీని వెనుక మా పార్టీలోని కొందరు కోవర్టులతో పాటు వైసీపీ నాయకులు ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ వివాదానికి ఇప్పటికే పూర్తి పరిష్కారం లభించిందని, శుక్రవారమే ఆ మహిళకు సదరు స్థలం రిజిస్ట్రేషన్ కూడా చేయించారన్నారు. లీకైనట్లు చెప్తున్న ఆడియోలో ఎలాంటి అభ్యంతరకర విషయాలు లేవని పైగా నన్నిఏదో విషయంలో ఇరికించాలనే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నా ఎదుగుదలను, నియోజకవర్గ అభివృద్ధిని ఓర్వలేకనే ఈ చిల్లర రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. ఈ మొత్తం విషయంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని, ఇందులో ఎవరున్నా చర్యలు తప్పవన్నారు. గత రెండేళ్లుగా నాపై బురద జల్లాలని చూస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహా కొందరు రాజకీయ నిరుద్యోగులు ఇప్పటికైనా ఇలాంటివి మానుకోవాలన్నారు. రాజకీయంగా ఉనికి కోల్పోతూ, రాత్రి నిద్రలో కూడా నన్నే కలవరిస్తున్నారన్నారు. రుద్రంపేటలోని ఎస్సీల స్థల వివాదాన్ని, అలాగే వైసీపీకి చెందిన బీసీ వ్యక్తి మైనార్టీ మహిళకు సంబంధించిన అస్రా ఆసుపత్రి వివాదాన్ని కూడా నాకే ఆపాదించి దుష్ప్రచారం చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. నాకు దగ్గరగా ఉన్న వారిని ఏదో విధంగా దూరం చేస్తున్నారని.. అందులో భాగంగానే సుధాకర్ యాదవ్‌ను, అలాగే నా పక్కన ఉన్న వాళ్లను కావాలనే వివాదాల్లోకి లాగి నన్ను ఒంటరిని చేయాలని కుతంత్రాలు పన్నుతున్నారన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలకు నేను భయపడే ప్రసక్తే లేదన్నారు. నాకు ప్రజలతో పాటు పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ల అండ ఉన్నంత వరకు ఏవరూ ఏమీ చేయలేరన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అనంతపురం కార్పొరేషన్ పరిధిలోని 62కి 62 స్థానాలను గెలుచుకుని తీరుతామని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల అంశంపై స్పష్టత వచ్చిన తర్వాత మేయర్ అభ్యర్థిపై స్పష్టత వస్తుందన్నారు. అధిష్టానం మేయర్ అభ్యర్థిగా ఒక సామాన్య కార్యకర్తకి ఇచ్చిన వారి గెలుపు కోసం పని చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

సీఐ బి.మనోహర్‌కు సన్మానం : జనసేన నాయకులు



పామిడి, అక్టోబర్ 10, దరువు న్యూస్ :

పామిడి పట్టణ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బి.మనోహర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ.. పామిడి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పామిడి మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ షావలి, జనసేన నాయకులు వసీం, పిట్టి ఖాజా, షేక్ షావలి, దాదు తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ 14వ వార్డు యువ నాయకుడు మన్సూర్ పాల్గొని నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటితో..

నూతన డీఎస్పీ కరుణాకర్ రావు భేటి

- నగరంలో పరిస్థితుల గురించి చర్చలు
- శాంతి భద్రతల విషయంలో రాజీవద్దని ఎమ్మెల్యే సూచన
- మా వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పిన దగ్గుపాటి

అనంతపురం, అక్టోబర్ 10, దరువు న్యూస్ :



ఇటీవల అనంతపురం నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్ రావు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో భేటి అయ్యారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నూతన డీఎస్పీకి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాంతిభద్రతలు, నగరంలో పరిస్థితులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నగర ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడమే ధ్యేయంగా శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అలజడులు లేకుండా చూడాలన్నారు. తమ వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : సాకే నరేష్



అనంతపురం, అక్టోబర్ 10, దరువు న్యూస్ :

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ సాకే నరేష్ ప్రశ్నలు లేవనెత్తారు. బీసీలకు న్యాయం జరగాలంటే రిజర్వేషన్ల పరిరక్షణతో పాటు, వారి హక్కులు, చట్టబద్ధమైన ప్రయోజనాల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాకే నరేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమం, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా, ఉద్యోగ అవకాశాల విషయంలో గతంలో ఇచ్చిన హామీలను విశ్లేషిస్తూ మాట్లాడారు. బీసీల అభివృద్ధి కోసం ప్రకటించిన హామీలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయో ప్రభుత్వం వివరించాలని కోరారు. బీసీలకు సంబంధించిన చట్టాలు, రిజర్వేషన్ల పరిరక్షణ, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం, విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాల కల్పన వంటి అంశాల్లో బీసీలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బీసీల సంక్షేమం మాటలకే పరిమితం కాకుండా, ఇచ్చిన హామీలను కార్యాచరణ ద్వారా నిరూపించాలని పేర్కొన్నారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం తమ సమితి నిరంతరం పోరాటం చేస్తుందని, బీసీలకు న్యాయం జరిగే వరకు తమ గళాన్ని వినిపిస్తామని డాక్టర్ సాకే నరేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు తోపు చంద్ర, రామాంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రెండో ఆసక్తికరంగా జరిగిన టోర్నీ

ఆత్మకూరు, అక్టోబర్ 10, దరువు న్యూస్ :



మండల పరిధిలోని సనప గ్రామంలో శ్రీ మాధవరాజుల స్వామి క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 3లో భాగంగా రెండో రోజు శనివారం జరిగిన మడు మ్యాచ్‌లు ఎంతో ఆసక్తికరంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెగా యత్ ఫోర్స్ సిటీ కన్వీనర్, రాంచరణ్ ఫ్యాన్స్ జిల్లా ఉపాధ్యక్షులు వరుణ్ హాజరయ్యారు. ఉదయం జరిగిన మ్యాచ్‌లో గుంతపల్లి, అనంతపురం జట్లు పోటీ పడగా.. అనంతపురం జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో వడ్డిపల్లి, సిండికేట్‌నగర్ జట్లు పోటీపడగా.. సిండికేట్ నగర్ జట్టు గెలుపొందింది. మడో మ్యాచ్ కొట్టాల, పీవీకేకే జట్లు తలపడగా.. పీవీకేకే జట్టు విజయకేతనం ఎగురవేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మధు నిలిచారని నిర్వాహకులు సనప ఓబులేసు తెలిపారు. ఈ అవార్డులను ముఖ్యఅతిథి వరుణ్ అందజేశారు.

మిత్రుని కుటుంబానికి రూ.10 వేలు సాయం

మండల పరిధిలోని సనప గ్రామానికి చెందిన నీళ్లపాల వినోద్ మృతి చెందారని, ఆ కుటుంబానికి తమవంతు సహాయంగా శ్రీమాధవరాజులస్వామి క్రికెట్ టోర్నీ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మిత్రుడు మా మధ్య భౌతికంగా లేకపోయినప్పటికీ.. వినోద్ జ్ఞాపకాలు ఎప్పుడూ మా మదిలో ఉంటాయన్నారు. వినోద్ ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం, అక్టోబర్ 10, దరువు న్యూస్ :

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అందులో భాగంగా అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో 61వ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక, మౌలిక వసతులు, రెవెన్యూ, పింఛన్లు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి ప్రజలు అర్జీలను అందజేశారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పరిశీలించి, సమస్య తీవ్రతను బట్టి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే అధికారులకు సూచనలు చేసి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి అర్జీని బాధ్యతగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావడానికి ప్రజా దర్బార్ ఒక వేదికగా ఉపయోగపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

లక్ష్మీనరసింహ స్వామికి విశేష ప్రత్యేక పూజలు

అమరాపురం, అక్టోబర్ 10, దరువు న్యూస్ :

అతి పురాతనమైన నిడగల్లు క్షేత్రం కొండలో వేలసిన శ్రీ యోగా లక్ష్మీనరసింహ స్వామి వారికి మహాలయ పక్షం అమావాస్య శనివారం సందర్భంగా విశేష ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు దేవస్థానం అర్చకులు హరీష్ బట్టర్ తెలిపారు. ఉదయం స్వామి వారికి వివిధ అభిషేకములు, పంచామృతభిషేకం జరిపి, ప్రత్యేక అలంకరణ చేసి, స్వామి వార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో కూర్చుండబెట్టి పూజలు జరిపి భక్తులు భక్తి శ్రద్ధలతో పల్లకితో ప్రాకారోత్సవం నిర్వహించి భక్తులు తమ మొక్కుబడి తీర్చుకున్నారు. స్వామి వారి ఉత్సవ మూర్తులతో గర్భగుడి చుట్టూ ప్రదిక్షణలు చేస్తే భక్తులు కోరిన కోర్కెలను స్వామి వారు తప్పకుండ తీరుస్తారన్న భక్తుల అపార నమ్మకం. ప్రా కారోత్సవం అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి తీర్థ ప్రసాదం వితరణ చేసారు. దేవాలయం అభివృద్ధికమిటి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న దానోహం నిర్వహించారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.